క్లుప్తంగా

ఎల్‌ఆర్‌ఎస్ సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తుదారులతో సమావేశమైన ఎంపీఓ

యాలాల: వ్యక్తిగత ప్లాట్స్ రెగ్యులరైజేషన్‌లో భాగంగా ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ అవకాశాన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల పంచాయతీ అధికారి గాలి యాదయ్య సూచించారు. బుధవారం మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ అగ్గనూరులో ఎల్‌ఆర్‌ఎస్ కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న వారితో సమావేశం నిర్వహించారు. ఎల్‌ఆర్‌ఎస్ రెగ్యులరైజేషన్‌లో భాగంగా ప్రభుత్వం 25 శాతం రిబేట్ అవకాశం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పరీక్ష ప్యాడ్ల అందజేత



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న ఉపాధ్యాయులు, దాత ముస్తాక్ పటేల్

దుద్యాల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్‌లను బుధవారం అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి, వృత్తి రీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడైన ముస్తాక్ పటేల్ విద్యార్థులకు ప్యాడ్లు అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ గతంలో దుద్యాల్ పాఠశాల చుట్టు గ్రామాల పాఠశాలలకు ఆదర్శంగా ఉండేదని గుర్తు చేశారు. పదోతరగతి విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు గుర్తింపు తేవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఎంఈవో విజయరామారావు, ఉపాధ్యాయులు రవీందర్ గౌడ్, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కొడంగల్ రూరల్: ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని ఫైలేరియా అధికారి ఫకిరప్ప పేర్కొన్నారు. మంగళవారం రాత్రి పట్టణంలోని వడ్డర్‌గల్లీలో ఫైలేరియా పరీక్షలు నిర్వహించారు. 130మంది రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందేందుకు అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ మహేశ్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పన్ను వసూలులో నిర్లక్ష్యం తగదు

యాలాల: గ్రామాల్లో ఇంటి పన్ను వసూలులో కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ఎంపీడీఓ పుష్పలీల, ఎంపీఓ యాదయ్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ సమావేశం హాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీరు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, వన నర్సరీలు, ఉపాధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.

రాగుల సాగు.. భలే బాగు

- మార్కెట్లో పెరిగిన డిమాండ్
- రాగి జావపై మక్కువ చూపుతున్న ప్రజలు
- సాగుతో లాభాలు పొందుతున్న రైతులు



హస్నాబాద్‌లో రైతు సాగు చేస్తున్న రాగి పంట

దుద్యాల్: ప్రధాన ఆహార పంటల్లో రాగి ఒకటిగా చెప్పొచ్చు. చిరు ధాన్యం పంటగా రాగి పండిస్తారు. పంట కాలం తక్కువ రోజులు కావడంతో ఖరీఫ్, రబీ సీజన్లతో పాటు వేసవిలో కూడా రాగి సాగు చేస్తారు. రాగిలో క్యాల్షియం అధికంగా ఉండటం, కొవ్వు పదార్థం తక్కువగా ఉండడం, పీచు పదార్థం ఉండడంతో ఆరోగ్యానికి మంచిది. వరి, గోధుమ కంటే పోషకాల శాతం దీంట్లో ఎక్కువగా ఉండడంతో ఇటీవలి కాలంలో మంచి పౌష్టికాహారంగా రాగిని గుర్తించి ప్రజలు వినియోగిస్తున్నారు. దీంతో గతంలో రాగి పంట విస్తీర్ణం తక్కువగా ఉండేది. ప్రస్తుతం ఈ పంట విస్తీర్ణం పెరిగింది. ప్రభుత్వాలు కూడా రాగి పంటకు మద్దతు ధర కల్పించడంతో రైతులు రాగుల సాగు భలే బాగు అని చెప్పకనే చెబుతున్నారు. అందుకు తగ్గ ప్రతిఫలం కూడా దక్కుతుందని చెబుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించారు. ముఖ్యంగా రాగి పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. నీటి తడులకు అవకాశం ఉన్న రైతులు రాగి పంటతో పాటు వేరుశనగ సాగు చేశారు. వేరు శనగా పంట కాలం పూర్తయింది. రాగుల పంట ప్రస్తుతం పూర్తి కావొస్తుంది. మార్కెట్లో రాగులకు మంచి డిమాండ్ ఉండడమే సాగుకు కారణం. గతంలో రాగులు, సజ్జలు, కొర్రలు, సామలు, హరికలు వంటి పంటలు సాగు చేసేవారు. క్రమంగా ఆయా పంటల సాగు తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో రాగి, కొర్ర పంటలు సాగు చేస్తున్నారు. గ్రామాల్లో చాలా మంది ప్రజలు ఆహారంగా రాగి సంకటి, రాగి జావ అధికంగా వాడుతున్నారు. పెద్ద పెద్ద పట్టణాల్లోని హోటళ్లల్లో కూడా రాగి సంకటి అందుబాటులో ఉంటుంది. షుగర్ వ్యాధి గ్రస్తులు ఎక్కువగా రాగి సంకటి, రాగి జావను ఆహారంగా తీసుకుంటున్నారు. దీంతో రాగులకు డిమాండ్ పెరిగింది. రాగులతో పాటు రాగి గడ్డికి కూడా మంచి గిరాకి ఉండడంతో చెరువులు, బోరు బావుల కింద వరి మాగాణి భూముల్లో వరి కోసిన తర్వాత రాగి పంట సాగు చేస్తున్నారు. రైతుల వద్దనే కిలో రూ.70 వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రాగి పంట సాగుతో మంచి లాభాలు గడిస్తున్నారు. మండల పరిధిలోని ఆలేడ్, కుదురుమల్ల, ఈర్లపల్లి తండా హంసంపల్లి, చెట్టుపల్లి, హస్నాబాద్ తదితర గ్రామాల్లో కొంత మంది రైతులు రాగి పంటను సాగు చేశారు.



రాగి జావ

అధిక దిగుబడినిచ్చే రకాలు..

రాగి పంటలో అధిక దిగుబడినిచ్చే రకాలలో మేలైన రకం మారుతి రకం. ఈ రకం పంట 85 రోజుల నుంచి 90 రోజుల వరకు పంట పూర్తవుతుంది. తెగుళ్లను తట్టుకుని ఎకరాకు 10 క్వింటాళ్ల వరకు దిగుబడినిస్తుంది. అన్ని ప్రాంతాల్లో సాగు చేసేందుకు వీలుగా ఉంటుంది. మిగతా రకాలైన మేగవతి, సువర్ణముఖి, వకుల, భారతీ, హిమా, శ్రీచైతన్య రకాలు కూడా అధిక దిగుబడినిస్తాయి.

రాగితో ఆరోగ్యం..

రాగి ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చు. రాగులతో చేసిన సంకటి, రాగి జావ తీసుకుంటే ఎంతో మంచిది. రాగుల 100గ్రాములు తీసుకుంటే అందులో 344 మిల్లి గ్రాముల కాల్షియం, 328 క్యాలరీల శక్తి, 3.6 గ్రాముల పీచు పదార్థాలు, 7.3గ్రాముల ప్రోటీన్ లభిస్తుంది. అందుకు పూర్వికులు ఎక్కువగా రాగులతో చేసిన పదార్థాలే తినేవారు. రాగి జావ వలన రక్తంలో గ్లూకోజ్ స్థాయి అదుపులో ఉంటాయి. రాగులు వాడటం వల్ల శరీర బరువు తగ్గించుకోవచ్చు.

మా చిన్నప్పుడు రాగులే దిక్కు..



గతిలేని రోజుల్లో మా చిన్నప్పుడు తిండికి ఇబ్బంది పడేవాళ్లం. పొలాల్లో వరి పంటలు అధికంగా పండేవికావు. రాగులు, పచ్చజొన్నలు, సజ్జలు పండించుకునే వాళ్లం. రాగుల రొట్టెలే మాకు ఆహారం. రాగి జావ, రాగులతో చేసిన రొట్టెలె నిత్య ఆహారం. పండగవేళ సజ్జలతో వంటకాలు చేసుకునేది. వారంలో రెండు రోజులు అన్నం తినేవాళ్లం. నాడు గతిలేక తినేవాళ్లం. నేడు ఆరోగ్య పరిరక్షణ కోసం రాగి సంకటి తింటున్నాం.

– లచ్చి బాయి, పులిచర్ల కుంట తండా

యాదవ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక



నూతన కమిటీని సన్మానిస్తున్న జిల్లా కమిటీ నాయకులు

దుద్యాల్: చిలుముల మైల్వార్ గ్రామ అఖిల భారత యాదవసంఘం గ్రామ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గోపాల్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా నర్సిములు, ఉపాధ్యక్షుడిగా రవి, నరేశ్‌లను, కోశాధికారిగా మొగులయ్య, కార్యదర్శులుగా శ్రీనివాస్, మొగులయ్యలు, గౌరవ అధ్యక్షుడిగా వెంకటయ్యలు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు జింకల యాదయ్య హాజరై మాట్లాడారు. యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని, కుల అభివృద్ధికి కలిసికట్టుగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పుర్ర రాఘవేందర్ యాదవ్, కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు మన్నె బస్వరాజ్, మండల అధ్యక్షుడు నర్సిములు యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, ఉపాధ్యక్షుడు నర్సిములు, నాయకులు ప్రభాకర్ యాదవ్ తదతరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని విద్యుత్ వినియోగంపై చర్యలు



వైర్లను తొలగిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

కుల్కచర్ల: అనుమతుల్లేని విద్యుత్ వినియోగంపై కఠినచర్యలు తప్పవని లైన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, లైన్‌మెన్ కుర్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండల పరిధిలోని పలు ఇటుకబట్టీల వద్ద నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్‌ను వినియోగిస్తుండటంతో అక్కడకు వెళ్లి వారికి నోటీసులు అందజేశారు. అక్కడ అక్రమంగా ఉన్న విద్యుత్ కనెక్షన్లను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎవరూ కూడా అనుమతులు లేకుండా విద్యుత్‌ను వినియోగించుకోవద్దని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లైన్‌మెన్ రాములు, అర్టిసన్ పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ధారూరు బాలుర ఉన్నత పాఠశాల తనిఖీ



పరీక్షా పత్రాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఈఈఆర్‌టీ అధికారులు డాక్టర్ వనిత, డాక్టర్ వనజ

ధారూరు: ధారూరు బాలుర ఉన్నత పాఠశాలను బుధవారం రాష్ట్ర విద్యా పరిశోధన విద్యామండలి అధికారులు తనిఖీ చేశారు. సబ్జెక్టుల వారీగా పాఠ్యాంశాలు పూర్తయ్యాయా? లేదా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల బోధన, టీ-షాట్ అంశాలు, టైంటేబుల్, ఉపాధ్యాయుల డై రీలు, పలు రికార్డులను ఎస్‌ఈఈఆర్‌టీ అధికారులు డాక్టర్ వనిత, డాక్టర్ వనజలు పరిశీలించారు. పదోతరగతి వరకు విద్యార్థులకు నిర్వహించిన అన్ని రకాల పరీక్షలు, విద్యార్థుల జవాబు పత్రాలను వారు పరిశీలించారు. మిడ్‌లైన్, బేస్‌లైన్ టెస్టులు, పదోతరగతి ప్రీఫైనల్ పరీక్షల జవాబు పత్రాలను వారు తనిఖీ చేశారు.

ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోండి

తాండూరు ఎంపీడీఓ విశ్వప్రసాద్



చెన్‌గేస్‌పూర్‌లో లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ విశ్వప్రసాద్

తాండూరు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా అర్హులైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను వెంటనే నిర్మించుకోవాలని తాండూరు ఎంపీడీఓ విశ్వప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చెన్‌గేస్‌పూర్ గ్రామంలో ఎనికెపల్లి గౌరమ్మ, కుర్వ మమత లబ్ధి దారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండల పరిధిలోని చెన్‌గేస్‌పూర్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి 144 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. చెన్‌గేస్‌పూర్‌తో పాటు అనుబంధ గ్రామం కోనాపూర్‌లోని లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులను చేపట్టుకోవాలన్నారు. బెస్‌మేట్ కట్టిన వెంటనే లబ్ధిదారుడి బ్యాంక్‌ఖాతాలో రూ. లక్ష జమ అవుతాయన్నారు. ఈ విషయంలో ఆందోళన చెందొద్దని, ఇళ్లను నిర్మించుకుంటే రూ.5 లక్షలు విడతల వారిగా మంజూరవుతాయన్నారు.

నచ్చిన స్థలంలో కట్టుకుంటాం..

చెన్‌గేస్‌పూర్‌కు వచ్చిన ఎంపీడీఓ విశ్వప్రసాద్‌తో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమ సమస్యలను మొరపెట్టుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక సమయంలో ఖాళీస్థలంలో కాకుండా తమసొంత స్థలంలో ఎక్కడైన ఇళ్లు కట్టుకుంటామని ఎంపీడీఓను కోరారు. గతంలో ఫొటో దిగిన ప్రదేశంలోనే ఇళ్లు కట్టుకోవాలని అధికారులు పెట్టిన ఆంక్షలను ఎత్తివేయాలని కోరారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఎంపీడీఓ బదులిచ్చారు.

కరాటేలో తాండూరు విద్యార్థుల ప్రతిభ

తాండూరు రూరల్: తెలంగాణ కరాటే చాంపియన్‌షిప్‌లో తాండూరు విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో 2025 కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. తాండూరుకు చెందిన మాస్టర్ జపాన్ చోటికాన్ కరాటే మాస్టర్ సాయిబన్న ఆధ్వర్యంలో ఐదు మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. 9 సంవత్సరాల కరాటే విభాగంలో అనుదీప్‌రెడ్డి గోల్డ్ మెడల్, 16 సంవత్సరాల బాలికల విభాగంలో హర్షిత సిల్వర్, 14 సంవత్సరాల విభాగంలో శ్యామల కాంస్య పథకం సాధించారు. అదేవిధంగా ప్రవీణ్, విశ్వనాథ్‌లకు కూడా ప్రొత్సాహక బహుమతులు అందజేశారు. జూన్ 11వ తేదీ నుంచి 13వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలో నిర్వహించనున్న నేషనల్ కరాటే చాంఫియన్‌షిప్‌లో వారు పాల్గొంటారని సాయిబన్న తెలిపారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో కరాటే మాస్టర్ సాయిబన్న

అభివృద్ధి పథంలో సహకార సంఘం

పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి



సొసైటీ పాలకవర్గాన్ని సత్కరించిన సీఈఓ బ్రహ్మం

బంట్వారం: అభివృద్ధిపథంలో సహకార సంఘం ముందుకు సాగుతుందని పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం సొసైటీ కార్యాలయంలో పాలకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అందరి సహకారంతో తన పదవీ కాలం సంతృప్తికరంగా పూర్తి చేశానన్నార. ప్రభుత్వం మరో ఆరు నెలల పాటు పదవీ కాలం పొడిగించడం హర్షణీయమన్నారు. త్వరలో నిర్వహించనున్న సర్వసభ్య సమావేశంపై పాలకవర్గం సభ్యులతో ఆయన పలు అంశాలపై చర్చించారు. అనంతరం సీఈఓ బ్రహ్మం చైర్మన్, డైరెక్టర్లను శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



దౌల్తాబాద్: బిచ్చాల పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



బొంరాస్‌పేట: బహుమతులు అందజేస్తున్న రవీందర్‌గౌడ్

దౌల్తాబాద్: మండలంలోని బిచ్చాల, కొడీడ్ గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం విద్యార్థులు ఘనంగా స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. బిచ్చాల పాఠశాలలో హెచ్‌ఎంగా బిందు, డీఈఓగా నవీన్, కలెక్టర్‌గా సాయికుమార్ వ్యవహరించారు. కొడీడ్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా సంజీవ్, డీఈఓగా నజిమున్‌తాబస్సుమ్ పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. వీరు తోటి విద్యార్థులకు బోధన చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు భార్గవి, రాజు, ఉపాధ్యాయులు ఉషారాణి, దస్తప్ప, శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట: విద్యార్థులు భవిష్యత్‌లో రాణించాలని, తమ లక్ష్య సాధనకు కలలు కనాలని చౌదర్‌పల్లి సీహెచ్‌ఎం రవీందర్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని నాందార్‌పూర్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు పాఠశాల విద్యార్థులు అధికారులు, ఉపాధ్యాయులుగా మారి ఒక్కరోజు తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వెంకట్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి



దోమ: గొడుగోనిపల్లి పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ వెంకట్

దౌల్తాబాద్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని తహసీల్దారు గాయత్రి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బాలంపేట గ్రామంలో కస్తూర్బా పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి తహసీల్దారు భోజనం చేశారు.

కుల్కచర్ల: విద్యార్థుల భోజనం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తహసీల్దార్ మురళీధర్ పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని కస్తుర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. కుల్కచర్ల కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, చౌడాపూర్ ప్రత్యేకాధికారి జ్యోతి పాల్గొన్నారు.

బంట్వారం: మెనూ ప్రకారం భోజనం పెట్టాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన బంట్వారం, కేజీబీవీ హాస్టల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రాంగోపాల్ పాల్గొన్నారు.

దోమ: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని దోమ మండల ఎంఈఓ వెంకట్ పేర్కొన్నారు. బుధవారం దోమ మండల పరిధిలోని గొడుగోనిపల్లి, రత్నానాయక్ తండాలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత పాటించాలన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



బంట్వారం: సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బంట్వారం: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని తాండూరు ఎమ్మెల్యే బి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన తాండూరు నియోజకవర్గంలోని కోట్‌పల్లి, ఇందోల్, ఓగుల్లాపూర్, అన్నాసాగర్, బుగ్గాపూర్ గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు. గాంధీజీ కలలుకన్న గ్రామస్వరాజ్యం నిర్మాణం కోసం ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం ఆయన తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి రెవెన్యూ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు అందజేశారు.

తాండూరు రూరల్‌లో..

తాండూరు రూరల్: ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో ఉద్దాండపూర్ గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని కాం గ్రెస్ గ్రామ అధ్యక్షుడు మీనాజోద్దీన్, సీనియర్ నాయకులు నర్సిములు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఉద్దాండపూర్ గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.8 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని ఉద్దాండపూర్ గ్రామాన్ని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. హైమాద్‌మియా ఇంటి నుంచి గోరెసాబ్, తాజోజీ ఇంటి నుంచి గొల్ల శాంతు ఇంటి వరకు సీసీరోడ్డు నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆనంద్‌రావు, వీరారెడ్డి, రాజు, నర్సిములు, హుసేనప్ప, మొగులప్ప, రియాజ్, మహేందర్‌రెడ్డి, ప్రదీప్, శ్రీనివాస్‌గౌడ్, శ్యామప్ప తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌ఖుర్దు గ్రామంలో..



ధారూరు: సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న మాధవరెడ్డి

ధారూరు: ధారూరు మండలంలోని మోమిన్‌ఖుర్దు గ్రామంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎంపీ నిధుల కింద మంజూరైన రూ. 5 లక్షలతో పనులను చేపట్టినట్లు మాధవరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకులు పాండుగౌడ్, నాయకులు ఎం. రమేశ్, వివేకానందారెడ్డి, రాజేందర్‌గౌడ్, శివరాజ్, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

దళితవాడల అభివృద్ధికి కృషి

మర్పల్లి: దళితవాడల అభివృద్ధికి కృషి చేస్తున్నామని వికారాబాద్ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు చంద్రయ్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కోట్‌మర్పల్లి గ్రామంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల కింద రూ. 5 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో అంబేడ్కర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను రాష్ట్ర ఉప కులాల ప్రధానకార్యదర్శి అనంత్‌రామ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు డప్పు మహేందర్ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డితో కలిసి ప్రారంభించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చొరవతో సబ్ ప్లాన్ నిధులను దళితవాడలకే ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఎస్సీ కాలనీలో మురుగు కాల్వల నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ బ్లాక్-2 అధ్యక్షుడు మల్కనెల్లి కృష్ణారెడ్డి ప్రారంభించారు. సహకార సంఘం డైరెక్టర్ మల్లారెడ్డి, నాయకులు రాంరెడ్డి నర్సింహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలు

బాటసరుల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలను ఏర్పాటు చేశామని జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు చంద్రయ్య పేర్కొన్నారు. కోట్‌మర్పల్లి గ్రామంలో బుధవారం స్థానిక నాయకులతో కలిసి ఆయన సొంత డబ్బులతో చలివేంద్రాన్ని ప్రారంభించారు.

పల్లెలో కళానందం



బొంరాస్‌పేట: మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో మునుపటి జానపద కళ ఆనందం కనిపించింది. గ్రామంలోని దళితులంతా భక్తిపూర్వకమైన సతీ అనుసూయ వీధినాటకాన్ని ప్రదర్శిస్తున్నారు. తొమ్మిది రోజుల వరకు ఉండే ఈ ప్రదర్శనను మంగళవారం రాత్రి ప్రారంభించారు. నారదుడు, అత్రి మహాముని, అనుసూయ, గంగాదేవి, పిశాచులు, లక్ష్మి, పార్వతి, సరస్వతి పాత్రలతో ప్రదర్శన ఆకట్టుకుంది. తెల్లవార్లు ప్రేక్షకులు ఆసక్తిగా తిలకించారు. గ్రామానికి చెందిన సీనియర్ వీధినాటకోపాధ్యాయుడు చాకలి రాములు శిక్షణ ఇవ్వగా 20మంది పాత్రదారులు ప్రదర్శిస్తున్నారు. ఈ ప్రదర్శనకు హార్మోనియం హనుమాన్‌చారి, తబల లింగస్‌పల్లి కాశప్ప సహకారం అందించారు. ఈ నెల 13, 15న రాత్రిపూట ఈ వీధి నాటక ప్రదర్శన నిర్వహించనున్నారని గోలెపు వెంకటయ్య, తుప్పుడు బందెప్ప, బ్యాగరి నర్సింలు, చింతకింది వెంకటయ్య, లక్ష్మయ్య తదితరులు తెలిపారు. వీధినాటక ప్రదర్శనకు మేకప్, డ్రెసింగ్, లైటింగ్, సౌండ్ చౌదర్‌పల్లికి చెందిన మధుకృష్ణ డ్రామా కంపెనీ అందిస్తున్నారు.

శంకర్ నాయక్‌కు శుభాకాంక్షలు

దుద్యాల్: ఇటీవల ప్రకటించిన ఎమ్మెల్సీ అభ్యర్థి శంకర్ నాయక్‌ను మండల కాంగ్రెస్ గిరిజన నాయకులు బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. ఎస్టీ క్యాటగిరిలో ఎమ్మెల్సీ ప్రకటించినందుకు చాలా ఆనందంగా ఉందని, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. గిరిజనుల సమస్యలను ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లి పరిష్కరించాలని శంకర్‌నాయక్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవి నాయక్, నాయకులు సంతోష్, రాహుల్, రాములు తదితరులు ఉన్నారు.